# అన్వేషణ

ఈ మధ్యే నాకు పెళ్ళి నిశ్చయమైంది. వయసులో వున్న ఒక అబ్బాయిగా అంతకంటే ఆనందించే విషయం మరొకటి ఏముంటుంది? అయితే ఇక్కడ బాధ కలిగించే విషయం ఏమిటంటే ... ఆ అమ్మాయిని నేను చూడక పోవటమే!

ఆ రోజు అమ్మాయిని చూసొచ్చి అంది అమ్మ-

"అమ్మాయి బాగుండటంతో ముహూర్తం కూడా ఒకేసారి నిశ్చయం చేసుకొని వచ్చేసాం. ప్రత్యేకంగా నువ్వు చూడాల్సిన అవసరం లేదు!"

మంచి శీతాకాలంలో అర్ధరాత్రి రెండు బక్కెట్ల చన్నీళ్ళు నెత్తిన కుమ్మరించినట్టయింది నా పరిస్థితి. చిన్నగా మామయ్య దగ్గరకు వెళ్ళి అడిగాను. "ఒక దారుణమైన చర్యలో నువ్వూ భాగం పంచుకున్నావా మామయ్యా"

"దారుణమైన చర్యా? ఏమిట్రా అది?" అర్థం కాని అయోమయంలో అడిగాడు మామయ్య. ఆ మాటలకు ఉక్రోష పడుతూ అన్నాన్నేను "ఆ అమ్మాయిని నేను చూసే అవసరం లేదా? మీ పాటికి మీరు చూసి కామ్‌గా పెళ్ళి సెటిల్ చేసెయ్యటమే"

ఆ మాటలు విని చిన్నగా నవ్వుతూ అన్నాడు మామయ్య.

"ఓహో! అదా సంగతి. నాకు కొంచెం జనరల్ నాలెడ్జి ఎక్కువని నీకు తెలుసు కదరా! మరి అంత నాలెడ్జి వున్న నీ మామయ్య చాతకాని వాడిలా కామ్‌గా వస్తాడని నువ్వెలా అనుకున్నావు? వాళ్ళను మాటల్లో పెట్టేసి నీకు కాబోయే భార్య పేరు చదువుతున్న కాలేజి పేరు - చదువుతున్న డిగ్రీ అన్నీ తెలుసుకొని నీ దగ్గర కొచ్చేసరికి మరచి పోతానని ఓ చిన్న సిగరెట్ ప్యాకెట్ ముక్క మీద రాసుకొచ్చాను. దాన్ని బట్టి నువ్వు ఆ వూరెళ్ళి ఆ అమ్మాయిని కలుసుకో ఓకే!"

హృదయంలో నుంచి తన్నుకొస్తున్న ఆనందానికి ఆనకట్ట వెయ్యలేక మామయ్య రెండు చేతులూ పట్టుకొని "థ్యాంక్యూ మామయ్యా! థ్యాంక్యూ!" అన్నాను.

చిన్న సిగరెట్ ప్యాకెట్ ముక్క నా చేతిలో పెడుతూ అన్నాడు మామయ్య-

"సిగరెట్ రేట్లు విపరీతంగా పెరిగి పోయాయి. బహుశా. 'గల్ఫ్ వార్' ప్రభావం వల్లనేమో! ఒక ప్యాకెట్టు అయిదు రూపాయలమ్ముతూంది"

మామయ్య బాధ నా కర్థమైంది. జేబులో నుంచి పది నోటు తీసి "సిగరెట్ ఫ్యాక్టరీ తీసుకొచ్చి నీ ముందుంచినా నీ రుణం తీరదు. ఈ పది వుంచు మామయ్యా" అని చెప్పి అట్టమీద అడ్రెస్ చూశాను.

**అభిషిక్త, ఫస్ట్ బి.ఏ., మంగమ్మ కాలేజి !!!** అని వుంది.

"అభిషిక్తా!" నా పెదవులతో పాటు హృదయం పలికింది. ముందుగా అభిషిక్తకు ఓ లెటర్ రాసి నేనొస్తున్నట్టుగా తెలియ జేయాలనిపించింది. లేడికి లేచిందే ప్రయాణమన్నట్టుగా అప్పటికప్పుడు ఓ తెల్ల కాగితం తీసుకొని రాయటం మొదలు పెట్టాను.

*అభిషిక్తా!*

*ఏమనుకున్నావో...? ఏంటి మీది [illegible] నిన్ను అందుకోబోతున్న నీ - నువ్వు!*

*ముక్కూ మొహం చూసుకోలేదు. అప్పుడే ఏక వచనంతో సంబోధిస్తున్నాడేమిటా అని కోపం తెచ్చుకున్నావా...? 'ప్రేమ' ఎప్పుడూ ఏకవచనంతో వుంటేనే బాగుంటుంది.*

*ముందు నీ పేరు చూశాను. ఆ తర్వాత నీ క్వాలిఫికేషన్ చూశాను. అయినా వయసులో వున్న అమ్మాయికి ప్రేమించే హృదయం కంటే గొప్ప క్వాలిఫికేషన్ మరేంకావాలి?*

*రః పెద్ద అనే మనుషులను చూశావా... ఎంతటి దారుణమైన మనస్తత్వాలో వీళ్ళవి! నిన్ను నా వాళ్ళు - నన్ను నీ వాళ్ళు చూస్తే సరి పోతుందా? మనం చూసుకోవలసిన అవసరం లేదా?*

*నిన్ను అమ్మ చూసొచ్చిన రోజు నాతో ఏం చెప్పిందో తెలుసా? నువ్వు బాగున్నావట! పెద్ద పెద్ద కళ్ళూ, ఎర్రటి చిన్ని చిన్ని పెదాలూ, గులాబి రంగుతో మెరుస్తున్న చెక్కిళ్ళూ! ఇంకా చాలా చెప్పింది. మరి ఇన్ని చెప్పిన తర్వాత నిన్ను చూడకుండా నేనెలా వుండగలను? వుండలేక రేపే వచ్చేస్తున్నాను.*

*మరి కాలేజీలో నీలాంటి అమ్మాయిలే (నీ అంత అందమైన వాళ్ళు కారనుకో) చాలా మంది వుంటారు కదా! నన్ను గుర్తు పట్టేదెలా? ఒక పని చేద్దాం. కాలేజి వదిలే టైమ్‌లో నేను గేట్ ఎంట్రన్స్ దగ్గర వైట్ ప్యాంట్ మీద స్నఫ్ కలర్ షర్ట్ 'టక్' చేసి చేతిలో నీకు మొదటి లేఖ రాసిన 'పెన్' పట్టుకుని నిలబడి వుంటాను. అప్పుడిక నా గురించి పట్టించుకునే బాధ్యత నీదే!*

*వస్తున్నాను మరి*
*నీ రవివర్మ*

వ్రాసింది మరోసారి చదువుకొని పోస్ట్ చేశాను. మరుసటి రోజే నా ప్రయాణం.

* * *

నేను ఆ వూళ్ళో దిగేసరికి పదిన్నర అయ్యింది. మంగమ్మ కాలేజి ఎక్కడుందో తెలుసుకొని చిన్నగా అక్కడికి చేరుకున్నాను. కాలేజి వదలటానికి ఇంకా అరగంట టైముంది!

నాకు చాలా ఆనందంగా వుంది. నా జీవితంలో నేనంతటి 'థ్రిల్' ఎప్పుడూ అనుభవించలేదు. మనసంతా ఉద్విగ్నంగా వుంది. కలల్లో తేలిపోతున్న నాకు కొద్దిసేపటి తర్వాత కాలేజీ వదిలిన సూచనగా బెల్ వినిపించింది.

నేను గేటు ప్రక్కగా వచ్చి నిలుచున్నాను. గుంపులు గుంపులుగా బయటకు రావటం మొదలు పెట్టారు స్టూడెంట్స్! మధ్యాహ్నం ఒంటి గంట సూర్యుడు సతాయిస్తున్నాడు.

నా వైపు ఏ అమ్మాయి అయినా పరీక్షగా చూస్తుం దేమో అని నా కళ్ళు అమ్మాయిల వైపు వెతుకుతున్నాయి.

ఎవరూ చూడటం లేదు సరికదా! నన్ను దాటుకొని అందరూ వెళ్ళిపోసాగారు. నాకు చాలా ఆందోళనగా వుంది. సాయంత్రపు సూర్యుడు కొండల్లోకి కృంగి పోయినట్టుగా ... నేను మధ్యాహ్నం ఒంటి గంటకు కాలేజి గేటు దగ్గర కృంగిపోతున్న సమయంలో రెండు జడలున్న ఓ కళ్ళజోడు అమ్మాయి నా దగ్గరకు రావటం చూశాను. నాకొంచెం ఆనందమేసింది. కాని కళ్ళ జోడమ్మాయి దగ్గరవుతున్న కొద్దీ ఆ ఆనందం కాస్త దుఃఖంగా మారిపోతోంది.

'కొంపదీసి ఈ అమ్మాయి కాదు కదా అభిషిక్తా!' ఈ ఆలోచనలతో సతమతమవుతున్న సమయంలో ఆ అమ్మాయి దగ్గరగా వచ్చి అంది.

"రవివర్మ అంటే మీరేనా ...? నేనేదో చెప్పటానికి ఉపక్రమిస్తుండగా మళ్ళీ తనే అంది "ఈ లెటర్ మీకిచ్చి రమ్మని అభిషిక్త పంపించింది"

ఆ సమయంలో నా మనసు పడే ఆనందాన్ని ఏ భావంతో సరిపోల్చేది? మల్లెపూలతో మత్తెక్కిన గాలి శరీరాన్ని స్పృశించిన అనుభూతి నుంచి తేరుకుంటూ ఆ అమ్మాయి చేతిలోని లేటర్ ఒక్క వుదుటున అందుకొని అన్నాను. 'తను ఎక్కడుంది?" నా గొంతు కంపించడం ఆ అమ్మాయి కూడా తెలిసిపోయింది కళ్ళెగరేసి నవ్వి కళ్ళజోడు సరి చేసుకుంటూ నా ముందు నుంచి కదిలి వెళ్ళిపోయింది. నేను ఆతృతగా నాలుగు మడతలుగా వున్న తెల్ల కాగితాన్ని విప్పాను నా కళ్ళు అక్షరాల వెంట పరిగెత్తాయి.

*రవీ!*

*నీ ఏకవచన సంబోధన నాకెంతో*




ఆనందాన్ని కలిగించింది. నువ్వు నన్ను చూడలేదు కదూ! నేను నిన్ను చూశాను. వైట్ ప్యాంట్ మీద స్నఫ్ కలర్ షర్ట్ టక్ చేసి చేతిలో పెన్ పట్టుకుని గేటు దగ్గర నిలబడి అమ్మాయిల వైపు చూస్తున్న నిన్ను చూస్తుంటే ... నాకెంత ముచ్చటేసిందో తెలుసా? అప్పటికప్పుడు నీ దగ్గరకు రావాలి అనే కోరికను బలవంతంగా నిగ్రహించుకుని ఇదిగో నా ఫ్రెండ్ ద్వారా లెటర్ పంపుతున్నాను.

సాయంత్రం నాలుగు గంటలకు గాంధీ పార్కు దగ్గర నీ కోసం ఎదురు చూస్తుంటాను. మరి నువ్వు తప్పక కలుసుకోవాలి''

వుంటాను మరి

నీ అభిషిక్త!

ఉత్తరం చదవడం పూర్తి చేసిన నేను నివ్వెరపాటుతో ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకొని ఇంత దూరం వచ్చి నిన్ను కలుసుకోకుండా వెళతానా? అనుకుంటూ అక్కడ్నుంచి కదిలాను.

* * *

పక్షుల గుంపు ఒకటి ఆకాశంలో, నయనిస్తోంది. గాంధీ పార్కులోని దానిమ్మ చెట్టు మీద సీతాకోక చిలకలు రెండు ఎగురుతున్నాయి. నా కళ్ళు వాటిని చూస్తున్నా నా మనసు మాత్రం అభిషిక్త చుట్టూ పరిభ్రమిస్తోంది. సాయంత్రం నాలుగు గంటల నీరెండ వేళ నాలో అలజడిని పెంచేస్తోంది. చేతికున్న రిస్ట్ వాచీలోని పెద్ద ముల్లు కదులుతూంది.

– నాలుగు గంటల పది నిమిషాలు!

'అప్పుడు కలిగింది ఆ ఆలోచన! కొంపదీసి అభిషిక్త గాని నన్ను ఏడిపించడం లేదు కదా! ఆ చిన్న ఆలోచనకే మనసంతా ఓ కొత్త అనుభవంతో నిండిపోయింది. సరిగ్గా ఆ క్షణంలోనే దూరం నుంచి నా వైపు వస్తున్న ఓ అమ్మాయి మీద నిలిచాయి. నా కళ్ళు. దగ్గరకొస్తూనే అంది ఆ అమ్మాయి.

"మీరు రవి వర్మ కదూ"

సందేహం లేదు. ఈ అమ్మాయే అభిషిక్త! అప్రయత్నంగా తొట్రుపాటుగా అన్నాను... "ఆ ... మీరు అభిషిక్త కదూ!"

అదేమిటే... ఉత్తరంలోను, కల్పనల్లోను ఏకవచనంతో దూసుకుపోయిన నేను- మనిషి ఎదురుగా కనిపించేసరికి నాకు తెలియకుండానే బహు వచనంలోకి మారిపోయాను. నా ఆలోచన తెగకముందే ఆ అమ్మాయి నవ్వింది. తర్వాత తీరికగా అంది.

"మీరనుకుంటున్నట్టుగా నేను అభిషిక్తను కాను. నా పేరు పద్మప్రియ! ఈ లెటర్ మీకిచ్చి రమ్మని అభిషిక్త పంపించింది"

పరమశివుడి కెంత కోపం వస్తుందో అంత కోపం వచ్చింది నాకా సమయంలో. వస్తున్న కోపాన్ని తమాయించుకొని అన్నాను -"మీ ఫ్రెండ్ హృదయం బండరాయి ప్లస్ ఇనుముతో తయారైనట్టుందే"

"నా ఫ్రెండ్ హృదయం ఇనుమో...బండరాయో మీకు 'ఫస్ట్ నైట్' తెలుస్తుంది లెండి. వస్తాను. మళ్ళీ మీ పెళ్ళిరోజున కలుసుకుందాం. -ఆల్ ది బెస్ట్ మై ఫ్రెండ్ హస్బెండ్!"

కొంటెగా నవ్వుతూ ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. నేను మిగిలాను. నాతో పాటు ఆకాశం – దానిమ్మ చెట్టు మిగిలాయి. నయనిస్తున్న పక్షుల గుంపు- ఎగురుతున్న సీతాకోక చిలకలు మాయమయ్యాయి. చిన్నగా లెటర్ విప్పాను.

*రవీ!*

*సారీ!! బాగా కోపం వచ్చినట్టుంది. నువ్వు కోపంలోనే బాగుంటావట! మా ఫ్రెండ్ చెప్పింది. కోపంలో ఎంత బాగుంటావో ఫస్ట్ నైట్ నేను తెలుసుకోవాలి. అన్నట్టు చెప్పటం మరచిపోయాను. మా ఫ్రెండ్ రూం ఒక టు*

ంది. రాత్రి ఎనిమిది గంటలకు అక్కడ కొచ్చెయ్! ముద్దు కూడా ఇస్తాను మరి! వస్తావో... రావో నీ ఇష్టం.

– నీ
అభిషిక్త

క్రింద ఏదో అడ్రెస్ వుంది. ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాను. ఎనిమిది గంటలకు ఇంకా మూడు గంటల టైముంది. ఈ లోపు అడ్రెస్ వెతకాలి.

*　　*　　*

సాయంత్రం ఎనిమిది గంటల సమయం.

రూమ్‌లా లేదది. ఓ ఇల్లులా వుంది. నేను అనుమానిస్తూనే ఆ ఇంట్లోకి అడుగు పెట్టాను. ఇంకేముంది? అభిషిక్త అమ్మ, నాన్న ఇద్దరూ నన్ను చూస్తూనే కంగారుగా లేచి నిలబడ్డారు. నా పరిస్థితి అయితే మరింత దారుణంగా తయారైంది. అభిషిక్త నన్నింత మోసం చేస్తుందనుకోలేదు. ఫ్రెండ్ రూమ్ అడ్రెస్ అని చెప్పి తన ఇంటి అడ్రెస్ ఇచ్చి పంపించింది.

ఇప్పుడు- కాబోయే అత్తా మామ "ఎందుకొచ్చావు బాబు?" అని ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలి? అయితే, నేననుకుంటున్నట్లు వాళ్ళు అలాంటి ప్రశ్నలేమీ వెయ్యలేదు సరికదా కాళ్ళు చేతులు కడుక్కోవటానికి నీళ్ళిచ్చి వంట ఏర్పాట్లు చేయసాగారు.

భోజనాలు అయిన తర్వాత నా కోసం ఓ రూమ్ కేటాయించి చూపించారు. ఇక్కడ నాకు కోపం ప్లస్ ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే.. ఇప్పటి వరకు అభిషిక్త నా కంట పడకపోవటమే.

పక్క మీద బాసింపట్టు వేసుక్కూర్చుని అదే విషయం గురించి ఆలోచించసాగాను. ఇంతలో తలుపు దగ్గర చప్పుడయ్యేసరికి ఆతృతగా తల తిప్పి చూశాను. వాకిట్లో నుంచి పదేళ్ళ అబ్బాయి నా కాబోయే చిన్న బావమరిది అనుకుంటా- సరాసరి నా బెడ్ దగ్గరకొచ్చి ఓ కవర్ నా గుండెల మీద పడేట్టు విసిరి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు. నేను ఆతృతగా కవర్ విప్పాను. ఫోటో - చిన్న లెటర్ వున్నాయి..

ముందు ఫోటో చూడకూడదు. చూస్తే 'థ్రిల్' ఏముంది? దాన్ని ఓ ప్రక్కన పెట్టేసాను. లెటర్ చదవటం మొదలు పెట్టాను.

*రవీ!*

*సారీ!! కంగారు పెట్టేసాను కదూ! నీకో థ్రిల్ కలిగించే ప్లాన్ వేసేరా... నువ్వు వస్తున్నట్టు మా ఇంట్లో వాళ్ళకు తెలుసు. నేనే చెప్పాను. నీకేదో అక్కడ అర్జంట్ పనున్నట్టు నాకు కాబోయే మామగారు ఫోన్ చేసినట్టు చెప్పాను. నీ ప్రక్కగదే నాది. ఈ రాత్రికి ఎవరో రచయిత చెప్పినట్టు - 'నిదురించే ప్రియురాలి చెక్కిలిపైన ముద్దు పెట్టుకోవటం ఎంత అందమైన దొంగతనం'. ఆ దొంగతనం నువ్వు చేస్తానంటే నాకేం అభ్యంతరం లేదు. కాకపోతే నా పక్కన నా నాయనమ్మ వుంటుంది. నువ్వు కన్‌ఫ్యూజ్ కాకుండా కొంచెం జాగ్రత్తగా వ్యవహరించు.*

*– చివరగా ఒక మాట!*

*రవీ!*

నీ 'అన్వేషణ'లో నువ్వు విజయం సాధించాలని నా ఫోటో పంపించాను. చూసావు కదూ ఫోటో! నీ అంత అందంగా వుండకపోవచ్చు. నీ కంటే చిలిపితనం మాత్రం నాలో ఎక్కువ! అందుకే 'ఫేస్' కట్ చేసి తీసేసిన ఫోటో పంపించాను"

నేను హతాశుడనై ఫోటోను చేతుల్లోకి తీసుకున్నాను. ముఖం లేని ఫోటో నన్ను చూసి నవ్వినట్టయ్యింది. కట్ చేసిన ఆ తెల్లటి భాగంలో నల్లటి అక్షరాలు మెరుస్తున్నాయి..

"అన్వేషణ"

షేక్ మహమ్మద్ రఫీ

## వైద్యుడు—వేంకటేశ్వరుడు!

అమెరికాలో –
అప్పిచ్చువాడు వైద్యుడు!
చిక్కులుంటే యిచ్చుకుంటామన్న
రూపాయి మొక్కుల్ని
ముప్పై తిప్పలు పెట్టి
డాలర్లుగా యిమ్మని
దబాయించేవాడు
'పిట్స్‌బర్గ్' వేంకటేశ్వరుడు!

– పిప్పళ్ల సూర్యప్రకాశరావు
మోర్గన్ టౌన్, వెస్ట్‌వర్జీనియా


Rated "One of the Best" Indian Restaurants in New Jersey by the *New York Times* & "Very Good" by the *Star Ledger*

**CHAND PALACE**

**79 Washington Street (Rt. 24 W.) Morristown**

**539-7433**

FINE EXOTIC INDIAN CUISINE
A MAGICAL DINING EXPERIENCE
Featuring Seafood • Vegetarian • Meat Dishes
Prepared With Mild, Medium Or Hot Spices
Discover & Enjoy The Exotic New Flavors From Our Tandoor (Clay) Oven




Open For Dinner 7 Days
Open For Lunch Mon-Sat 11:30am - 2:30pm
We Arrange For Private Parties, Birthdays, Weddings
Full-Service On & Off-Premise Catering
Parties & Corporate Functions - All Occasions
Complete Take-Out Service

**50% OFF**
**Second Dinner of Equal or Lesser Value (Minimum 2 Dinners)**
With This Coupon • Limit One Per Table
Not To Be Combined With Other Offers
Expires 7-7-90

**$3 OFF**
**Any Luncheon Check of $10 or More. Buffet Excluded**
With This Coupon • Limit One Per Table
Not To Be Combined With Other Offers
Expires 7-7-90

**$3 OFF**
**Any Take-Out Order of $10 or More**
With This Coupon • Limit One Per Table
Not To Be Combined With Other Offers
Expires 7-7-90